www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# ఫిర్యాదులు చేసిన ఫలితం శూన్యం
# అధికారులపై గ్రామస్తులు ఆరోపణలు

**మురుగునీరు రోడ్లపై ప్రవాహం..**

**అధికారుల పై మండిపడిన సిపిఎం నాయకులు**

**ఆదోని,జూన్17.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పెద్ద తుం బళీ గ్రామం లోని శివాలయం పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో నిండి తీవ్ర దుర్వాసన వెద జల్లుతున్నాయని సిపిఎం నాయకుడు లింగన్న ఆరోపించారు కాలవల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా మురుగునీరు రోడ్లు పైకి పొంగిపొర్లతు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు శివాలయం ప్రాంతంలో పరిశుభ్రత పూర్తిగా దెబ్బతిన్నందున స్థానికులు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్ అండ్ బి రోడ్డు కల్వర్టు బండలు కుంగిపోవడంతో నీళ్లు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఆ ప్రాంత ప్రజలకు అనేక రోగాలు తెచ్చిపెడుతున్నదని, తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఆ కల్వర్టును బాగుచేయాలని మరియు డ్రైనేజీని నిర్మాణం చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే వెంకటేశులు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న డిమాండ్ చేశారు స్థానిక సిపిఎం నాయకులు హనుమంత్ రెడ్డి, దాసప్ప, కాజా మరియు గ్రామస్తులతో పరిశీలించడమమైనది. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ ఇది చాలా తీవ్రమైన సమస్యని స్థానిక పంచాయతీ అధికారులు మరియు ఆర్ అండ్ బి అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో సచివాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**పిఆర్సీ అమలులో నిర్లక్ష్యం తగదు**

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ డిమాండ్**

**బద్వేల్,జూన్17.అక్షర టైమ్స్:-** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం బద్వేల్ లోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం తగదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు కావస్తున్నదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పిఆర్సీని అమలు చేస్తుందని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. 12వ పిఆర్సీని అమలు చేయకపోవడం మూలన పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరిస్తామన్న కూటమి పెద్దలు, రెండేళ్ల పాలనలో కనీసం పిఆర్సీ కమీషన్ ను సైతం నియమించకపోవడం దారుణమన్నారు. తక్షణం పిఆర్సీ



కమిషన్ ను ఏర్పాటుచేసి పిఆర్సీ అమలయ్యే వరకు 30% మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన డిఏలు సైతం చెల్లించకుండా నాలుగు డీఏలను పెండింగ్ లో ఉంచడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్థిక బకాయిలను కొంతమేరకు చెల్లిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో చెల్లింపులు లేవన్నారు. గత పిఆర్సీ బకాయిలతో పాటు, మిగిలిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించాలని కోరారు. సరెండర్ లీవ్ బకాయిలు మూడేళ్లుగా చెల్లింపులకు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు విధానంపై కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. ఎన్నో ఏళ్ళుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాలనటం సరికాదన్నారు. టెట్ సమస్యపై విద్యాశాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23(1) లో సవరణ చేసేందుకు కృషి చేయాలని కోరారు. గత బదిలీలలో బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను తక్షణం వారు బదిలీ పొందిన స్థానానికి పంపేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హై స్కూల్ ప్లస్ లలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హై స్కూల్ ప్లస్ లను బలోపేతం చేయాలని, కేజీబీవి ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, వేతన స్కేలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కరోనా మహమ్మారిలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టి వారిపై కారుణ్యత ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధి ప్రదర్శించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరుబాట పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, బద్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, సహాధ్యక్షుడు వై.రామయ్య, కార్యదర్శి సి.హెచ్.సాగర్, గోపవరం మండల ప్రధాన కార్యదర్శి ఎం.రామచంద్రయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎన్.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి ఉన్నతమైన లక్ష్యం కలిగి ఉండాలి

**ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ : ప్రిన్సిపాల్ రవి**





**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-** ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలను కలిగి ఉండాలని ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి సూచించారు. బుధవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, గమనిక పుస్తకాలు తదితరాలను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కళాశాలలో ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రవి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రవేశం పొందాలని ఆయన సూచించారు. గత ఏడాది నుండి కళాశాలలో ఉర్దూ మీడియం (ఉర్దూ మాధ్యమం) తో పాటు ఇంగ్లీష్ మీడియం (ఆంగ్ల మాధ్యమం) తరగతులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. కావున పదో తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థి తమ కళాశాలలో ప్రవేశం పొందాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 8919393477, 9885803863, 9248786996 తెలిపారు.

# మానవ సంబంధాల్లో అత్యంత ప్రధానమైనది
# భార్యాభర్తల బంధం : డా” నర్రెడ్డి తులసిరెడ్డి



**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-** మానవ సంబంధాల్లో అత్యంత ప్రధానమైనది భార్యాభర్తల బంధమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన మల్లంగి జయలక్ష్మమ్మ, మల్లంగి సుధాకర్ రెడ్డి దంపతుల కుమారుడు నాగార్జున రెడ్డి వివాహం, పాములూరు గ్రామానికి చెందిన నారాయణమ్మ, రామలింగారెడ్డి దంపతుల కుమార్తె సంగీత వాణితో వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ, మానవ సంబంధాల్లో భార్యాభర్తల బంధం అత్యంత కీలకమని తెలిపారు. ఈ బంధానికి వివాహం చట్టబద్ధతతో పాటు సామాజిక భద్రతను కూడా కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# సర్ సర్వే గురించి ఎమ్మార్వోని
# అడిగి తెలుసుకున్న వైసీపీ నాయకులు



**కౌతాళం,జూన్17.అక్షర టైమ్స్:-** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఇంటింటా సర్వే సందర్భంగా బిఎల్ఓ అధికారులు మరియు ఓటర్లుకు సంబంధించిన విషయాలును ఎమ్మార్వో ను అడిగి తెలుసుకున్న కౌతాళం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు మరియు వైఎస్ఆర్సిపి మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం నిర్వహించిన(సర్) ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల ఇంటింటా సర్వే గ్రామ బూత్ లెవెల్ అధికారులు మరియు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు బూత్ కన్వీనర్ లతో కలిసి ప్రతి ఓటర్ సమస్యలను విని పరిష్కారం చూపుతూ,దీని ద్వారా అక్రమ, డూప్లికేట్ ఓట్లను తొలగించి,అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా వైఎస్ఆర్సిపి కౌతాళం మండలం బుత్ కమిటీ సభ్యుల కు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఎ పి. వెంకటరామిరెడ్డి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, మాజీ సర్పంచ్ పాల్ దినకర్,ఎంకట్రం రెడ్డి, రామస్వామి,నర్సిరెడ్డి, సక్రి శ్రీరామ్,ఖాలిల్ మరియు వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరూ ఓటరుగా
# నమోదు కావాలి: ఆర్ఐ లోకేష్

**ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటరు సవరణ ఫారాల పంపిణీ**



**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-**ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా బుధవారం తహసిల్దార్ ఆదేశాల మేరకు వేంపల్లెలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) లోకేష్ పాల్గొన్నారు. స్థానిక సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపునకు సహకరించాలని ఆర్ఐ లోకేష్ సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి ను
# పరామర్శించిన బద్వేల్ నియోజకవర్గ
# అదనపు సమన్వయ కర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి



**మైదుకూరు, జూన్ 17. అక్షర టైమ్స్:-** బద్వేల్ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున్ రెడ్డి ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైస్సార్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా ప్రమర్శించడం జరిగినది.ఈ సందర్భంగా దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించడమైనది.ఈ కార్యక్రమములో బద్వేల్ నియోజకవర్గ వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితపై అవమానకర
# వ్యాఖ్యలు : గుడివాడ అమర్నాథ్ క్షమాపణ చెప్పాలి

**మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదు**

**జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**



**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. దళిత మహిళగా, ఉపాధ్యాయురాలిగా జీవితాన్ని ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న అనిత వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యానించడం అమర్నాథ్ దురహంకారానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఇది కేవలం హోంమంత్రి అనితపై జరిగిన దాడి మాత్రమే కాకుండా యావత్ మహిళా సమాజానికి జరిగిన అవమానమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, హోంమంత్రికి మరియు మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదని దాసరి రవిశంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చెన్నకృష్ణా రెడ్డి, నారాయణ, శ్రీను, కృష్ణ, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును
# పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలి**

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి**





**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమని, ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రామముని రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఓటర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అక్రమంగా ఓటర్లను చేర్చే ప్రయత్నాలు జరిగితే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బూత్ కమిటీ సభ్యులు ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటర్లకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు రెడ్డిరాణి, గంగిరెడ్డి, బూత్ కమిటీ సభ్యులు మహమ్మద్, జబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

**ఎంఈవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**




**వేంపల్లె,జూన్17.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులపై స్కూల్ యూనిఫాంలు, పుస్తకాల కొనుగోలు విషయంలో ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఫీజుల వివరాలను సూచిక బోర్డులపై ప్రదర్శించాలని, విద్యా హక్కు చట్టం అన్ని పాఠశాలల్లో సమర్థంగా అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, బీజేపీ నాయకులు మునగల చంద్ర, సురేష్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష,మాజీ
# ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఓట్లే గల్లంతయితే సామాన్యులకు దిక్కేది.?

**బిఎల్ఓ ల వద్ద ఉండాల్సిన కలర్ జిరాక్స్ ఓటర్ల జాబితా టిడిపి బిఎల్ఎ ల వద్ద ఎలా ఉన్నాయి.?**

**‘సర్’ పై వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి నిశిత విమర్శ**

**కడప,జూన్17.అక్షర టైమ్స్:-** కడప నియోజకవర్గం నుండి రెండుసార్లు శాసనసభ్యులుగా ఉండి, డిప్యూటీ సీఎంగా పని చేసి, దాదాపు 35 ఏళ్లకు పైబడి కడప నగరంలో ఓటర్ గా ఉన్న అంజాద్ భాష, మైదుకూరు నియోజకవర్గం నుండి నాలుగు సార్లు శాసనసభ్యులుగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా పనిచేసి, తమ స్వగ్రామం నక్కల దిన్నెలో 60 సంవత్సరాలకు పైబడి ఓటరుగా ఉన్న శెట్టిపల్లి రఘురామిరెడ్డి ల ఓట్లే తొలగిస్తే... గల్లంతయితే వైఎస్ఆర్సిపి సామాన్య ఓటర్లకు దిక్కెక్కడని? వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి , కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి నిశితంగా విమర్శించారు. కడప నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ బి ఎల్ ఓ ల వద్ద ఉండాల్సిన కలర్ జిరాక్స్ ఓటర్ల జాబితా టిడిపి, కూటమి కి చెందిన బి ఎల్ ఎ వద్ద ఎలా ఉందని? ఆయన సూటిగా ప్రశ్నించారు. ఓటర్ల వ్యక్తిగత





వివరాలను టిడిపి యాప్ లో నమోదు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. ఎస్ ఐ ఆర్ (సర్) ప్రక్రియలో భాగంగా టిడిపి, కూటమి పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, ఆ సమాచారాన్ని ‘మై టిడిపి పాస్పోర్ట్’యాప్ లో నమోదు చేస్తూ ఫారం -7ను అధికారులకు సమర్పించి వైఎస్ఆర్సిపి అతి ముఖ్య నేతలను, మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన వివరించారు. ప్రతి బిఎల్ఎ తమ పరిధిలో కనీసం 50 నుండి 100 ఓట్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీగా వ్యూహం పన్నుతోందని ఆయన పేర్కొన్నారు. టిడిపి, కూటమి బిఎల్ఎ ల అక్రమాలను అడ్డుకోవాల్సిన బిఎల్ఓ లు వారికి పూర్తిగా సహకరించడంతోనే వైయస్ఆర్సీపీ ఓట్లను ఎదేచ్ఛగా తొలగిస్తున్నారన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను 2002 ఓటర్ల జాబితా ఆధారంగా నిర్వహిస్తున్నప్పుడు ఆ ఓటర్ల జాబితాను ఆన్లైన్ లో ఉంచకపోవడం ఎన్నికల కమిషన్ కూటమినేతలకు సహకరించడమేనని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బిఎల్ఓ లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అలాకాకుండా టిడిపి, కూటమినేతలకు సహకరిస్తే బీఎల్ఓ లపై కోర్టుల ద్వారా చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కూటమినేతలు తమ రెండేళ్ల పాలనకు సంబంధించి విజయోత్సవం ర్యాలీలో కూటమి ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసుకోకుండా వైయస్ జగన్ పై అసందర్భ ప్రేలాపనలు చేయడం వారి నీచ రాజకీయానికి పరాకాష్ట అని రెడ్యం ఎద్దేవా చేశారు

## డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన పాల పుల్లయ్య కలసపాడు నాయకులు



**కలసపాడు,జూన్17.అక్షర టైమ్స్:–** బద్వేల్ నియోజకవర్గం, కలసపాడు మండలం, చింతలపల్లి గ్రామానికి చెందిన పాల పుల్లయ్య ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాల పుల్లయ్య చింతలపల్లి గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చైర్మన్ తో చర్చించారు. అనంతరం డీసీసీ బ్యాంక్ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలపై చైర్మన్ కృషిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్,చెరుకూరి రవి కుమార్ నాయుడు,కలసపాడు మండల నాయకులు కొత్తకోట సొసైటీ చైర్మన్ కల్లూరు దుగ్గిరెడ్డి,పామూరు బాలిరెడ్డి ,తదితర నాయకులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ మహోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే డీసీ.గోవింద రెడ్డి



**బద్వేల్,జూన్17.అక్షర టైమ్స్:–** బద్వేల్ మండలం తిప్పనపల్లె గ్రామానికి చెందిన శ్రీ మన్యం వెంకట సుబ్బారెడ్డి ,ప్రభావతి కుమార్తె సుష్మా రెడ్డి మరియు రతన్ కుమార్ రెడ్డి ల నిశ్చితార్థ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విచ్చేసి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు.

## త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

### బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ



**బద్వేల్,జూన్17.అక్షర టైమ్స్:–** కడపజిల్లా బద్వేల్ నియోజకవర్గం లోని పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్‌ను త్వరలో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

### కలెక్టర్ జి రాజకుమారి గణియా



**నంద్యాల,జూన్17.అక్షర టైమ్స్:–** జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాభ్యాసం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. జూన్ 21 యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఇప్పటికే 3.50 లక్షల మంది 'యోగాంధ్ర' యాప్, పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారని తెలిపారు. గ్రామాలు, వార్డులు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమ విజయవంతానికి సహకరిస్తున్న యోగా సంస్థలు, యోగా గురువులు, ఆయుష్, వైద్య ఆరోగ్య, క్రీడాశాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జౌళీ శాఖ మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ని కలిసి చేనేత సమస్యల గురించి మాట్లాడిన

### పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్



**కడప,జూన్17.అక్షర టైమ్స్:–** కడప జిల్లా డిఆర్సీ సమావేశం సందర్భంగా కడపకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ చేనేత,జౌళీ శాఖ మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి సంజీవరెడ్డి సవితమ్మ ని కలిసి చేనేత సమస్యల గురించి మాట్లాడిన పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్, కడప పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కాలువ ధనలక్ష్మి, కడప అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆలూరు నరసింహులు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

## పుల్లంపేటలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు





**పుల్లంపేట,జూన్17.అక్షర టైమ్స్:–** తిరుపతి జిల్లా పుల్లంపేటలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు జిల్లా ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు.సీఐ కార్యాలయ ప్రాంగణంలో చెట్లను నాటిన ఎస్పీ సుబ్బారాయుడు. నూతన సీఐ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యమానికి అదనపు ఎస్పీలు, ఆర్ల శ్రీనివాసులు, రవి మనోహరాచారి, రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు,రైల్వే కోడూరు పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్సై ప్రసాద్ రెడ్డి,పుల్లంపేట రూరల్ సర్కిల్ లోని ఎస్సైలు చిన్న రెడ్డెప్ప, ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్, చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్, పెనగలూరు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల గౌరవం పై వైసీపీ ద్వంద్వ వైఖరి: గుడిసె ఆది కృష్ణమ్మ

### హోంమంత్రి అనిత పై వైసీపీ నేతల నోరుజారుడు వ్యాఖ్యలు

### జగన్ సంస్కారానికి అద్దం పడుతున్నాయి

### ఖండించిన గుడిసె ఆధి కృష్ణమ్మ



**ఆదోని,జూన్17.అక్షర టైమ్స్:–** మహిళా హోంమంత్రి అనిత పై వైసీపీ నేతలు చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలు అత్యంత ఖండనీయం గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. మహిళల గౌరవం గురించి తరచుగా ఉపన్యాసాలు ఇచ్చే వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పార్టీ నేతల మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేసిన ప్రతిసారీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. మహిళల పట్ల గౌరవం చూపాలని చెప్పే జగన్మోహన్ రెడ్డి తన సొంత సోదరి వైయస్ షర్మిలపై అవమానకర వ్యాఖ్యలు జరిగిన సమయంలో కూడా స్పందించలేదని గుడిసెఆది కృష్ణమ్మ ఆరోపించారు. మహిళలపై అంచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో వైసిపి నాయకత్వం విఫలమైందని అన్నారు హోం మంత్రి అనిత పై చేసిన వ్యాఖ్యలను ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ మహిళల గౌరాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం సమశీజసం కాదని పేర్కొన్నారు. మహిళల గౌరవం విషయంలో ద్వంద్వవైఖరి అవలంబించే వారికి మహిళల గురించే మాట్లాడే నైతిక హక్కు లేదని గుడిసె కృష్ణమ్మ ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేని వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలు, అసభ్య వ్యాఖ్యలతో రాజకీయాలు చేయడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం. మహిళలను అవమానించడం వైసీపీకి అలవాటుగా మారింది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.. మహిళల గౌరవాన్ని తాకిన ప్రతి అవమానానికి ప్రజాస్వామ్య బద్ధంగా తగిన సమాధానం చెబుతారు. "మహిళలపై గౌరవం మాటల్లో కాదు... చేతల్లో చూపించాలి. జగన్ మౌనం వైసీపీ మనస్తత్వానికి సాక్ష్యం అని పేర్కొన్నారు

## నంద్యాల పేదల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడే ఏకైక పేరు 'శిల్పా








### రూ. 10 వేల లోపు ఉండే వైఎస్సార్ కళ్యాణ మండపం అద్దె ఇప్పుడు రూ. లక్షలా?

### కూటమి ప్రభుత్వంపై నంద్యాల ప్రజల ఆగ్రహం.. శిల్పా సేవా కార్యక్రమాలపై కక్షసాధింపా?

### మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి నిర్మించిన మండపాన్ని సామాన్యులకు దూరం చేశారంటూ ఆవేదన.

### పేద మహిళల అభ్యున్నతికి శిల్పా కుటుంబం కృషి.. సేవలను అడ్డుకోవడంపై ప్రజా నిరసన

**నంద్యాల,జూన్17.అక్షర టైమ్స్:–** పేద ప్రజల శ్రేయస్సు కోసమే దశాబ్దాలుగా పనిచేస్తున్న శిల్పా కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో కేవలం నిర్వహణ ఖర్చులకే అందుబాటులో ఉన్న కళ్యాణ మండపాన్ని, ఇప్పుడు సామాన్యుడు అందుకోలేనంత ఖరీదుగా మార్చడంపై నంద్యాల ప్రజలు మండిపడుతున్నారు. నంద్యాలలో పేదల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడే ఏకైక పేరు 'శిల్పా కుటుంబం'. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి స్థాపించిన 'శిల్పా సేవా సమితి' ద్వారా గత కొన్నేళ్లుగా ఎన్నో సామాజిక మార్పు కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే, పేద ప్రజలు భారీ ఖర్చులతో వివాహాలు చేసుకోలేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ కళ్యాణ మండపాన్ని శిల్పా మోహన్ రెడ్డి తన స్వంత నిధులతో నిర్మించారు.గతంలో ఈ కళ్యాణ మండపంలో శుభకార్యాలు జరుపుకునే వారు,కేవలం శుభ్రత, సిబ్బంది నిర్వహణ ఖర్చుల నిమిత్తం 7 వేల నుండి 10 వేల రూపాయల లోపే చెల్లించేవారు. అత్యంత తక్కువ ఖర్చుతో ఎంతో వైభవంగా ఇక్కడ పేదల పెళ్లిళ్లు జరిగేవి.అయితే, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎంతోకాలంగా పేదలకు అండగా ఉన్న ఈ వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఇప్పుడు శుభకార్యం జరుపుకోవాలంటే ఏకంగా లక్షా యాభై వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ పెంపు నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇక్కడ పెళ్లిళ్లు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. తక్కువ ఖర్చుతో కార్యం ముగించుకుందామనుకునే పేదల కడుపు కొట్టారంటూ నంద్యాల నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాను సంపాదించిన దాంట్లో 10 శాతం నిధులను నేరుగా పేద మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయిస్తూ వస్తున్న మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సేవా కార్యక్రమాలపై కూటమి ప్రభుత్వం ఎందుకు ఇంత కక్ష కట్టిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శిల్పా కుటుంబంపై ఉన్న రాజకీయ విద్వేషంతో పేదలకు అందే సేవలను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని నంద్యాల వాసులు నిలదీస్తున్నారు. పేదలకు మంచి చేస్తే ఇలాంటి కక్షసాధింపులే ఎదురవుతాయా అంటూ స్థానికంగా తీవ్ర చర్చ నడుస్తోంది.

## రెండేళ్ల పాలనకు నంద్యాలలో ఘన వేడుక

### అభివృద్ధి--సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### అర్హులందరికీ పథకాల ఫలాలు అందిస్తున్నాం

### మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి



**నంద్యాల,జూన్17.అక్షర టైమ్స్:–** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం బుధవారం నంద్యాల టెక్కే మార్కెట్ యార్డు ఆవరణలో ఘనంగా జరిగింది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు--భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, బిజెపి నాయకులు. జనసేన నాయకులు. అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గత రెండేళ్లలో రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీలు తదితర పథకాల ద్వారా వందల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అలాగే పరిశ్రమల స్థాపన, జాబ్ మేళాలు, మహిళా సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందన్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సాంకేతికత వినియోగంతో నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. మహిళల భద్రత, గంజాయి నియంత్రణ, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్త జయసూర్య మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ముందంజలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు 19 ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ ప్రదర్శన స్టాళ్లను మంత్రులు, ప్రజాప్రతినిధులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీ ని కలిసిన రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మాన్యుయేల్




**ప్రొద్దుటూరు,జూన్17.అక్షర టైమ్స్:–** ప్రొద్దుటూరు పరిధిలో కొనసాగుతున్న తీవ్రమైన కుల వివక్ష, తప్పుడు ఫిర్యాదులతో దళితులపై జరుగుతున్న వేధింపులు, మరియు స్థానిక పోలీసుల పక్షపాత వైఖరి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ 4 కింద చర్యలు తీసుకోవాల్సిందిగా అభ్యర్థిస్తూ ఎఎస్పీ విభూ కృష్ణ ను రాష్ట్ర మాల మహానాడు, జాతీయ అధ్యక్షుడు, రామోజీ ఇమ్మాన్యుయేల్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంతాలలో దళిత వర్గాలకు చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వ్యవస్థాగత పక్షపాతం, వేధింపులు మరియు చట్టపరమైన నిబంధనల దుర్వినియోగాన్ని మీ అత్యవసర గమనానికి తీసుకురావడానికి ఈ లేఖ వ్రాస్తున్నానని తెలిపారు. ప్రొద్దుటూరులో కుల వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని దళితులను ఒక రకంగా తక్కువ చేసి చూస్తూ, అగ్రవర్ణాల వ్యక్తులతో పూర్తి భిన్నంగా, అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో ఘోరంగా విఫలమయిందన్నారు . బాధ్యతాయుతమైన పౌరుడిగా నేను ఈ అధికారిక ఫిర్యాదును మీ వద్దకు తీసుకువస్తున్నానని వివరించారు.

**ప్రశ్నించే హక్కును అణచివేయడం:**

ఈ తప్పుడు కేసులపై ప్రశ్నించడానికి లేదా తమ వైపు ఉన్న నిజాలను చెప్పుకోవడానికి దళిత వర్గాల ప్రజలు స్థానిక పోలీసు అధికారులను ఆశ్రయించినప్పుడు, వారి మొరను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు.

**న్యాయమైన ఫిర్యాదులను నేరంగా చిత్రీకరించడం:**

వ్యవస్థలోని లోపాలను, అవినీతిని లేదా అన్యాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు మరియు బాధ్యత. అయితే, దళిత సమాజానికి చెందిన వ్యక్తులు అక్రమార్కులపై చట్టబద్ధంగా ఫిర్యాదు చేసినప్పుడు, పోలీసు శాఖ ఎలాంటి విచారణ లేకుండా ఆ ఫిర్యాదులను "బ్లాక్ మెయిలింగ్" మరియు "వసూళ్లు" గా చిత్రీకరిస్తూ రివర్స్ కేసులు నమోదు చేస్తోందని వాపోయారు.

**ఫిర్యాదుదారుల వివరాల గోప్యత భంగం:**

దళిత పౌరులు స్థానిక అక్రమార్కులపై ధైర్యం చేసి ఫిర్యాదు చేసినప్పుడు, సదరు అధికారులు ఫిర్యాదుదారుల వివరాలను లేదా వారి గుర్తింపును నేరుగా నిందితులకు, అక్రమార్కులకు వెల్లడిస్తున్నారనే విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఈ విధంగా గోప్యతను ఉల్లంఘించడం వల్ల బలహీన వర్గాలకు చెందిన ఫిర్యాదుదారులు స్థానిక రాజకీయ శక్తుల నుండి తీవ్రమైన ప్రతీకార దాడులకు, శారీరక బెదిరింపులకు మరియు మరిన్ని వేధింపులకు గురవుతున్నారని, అధికారుల ఎదుట ఒక ఫిర్యాదు నమోదైనప్పుడు, వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదు దారుడి గుర్తింపును లేదా వివరాలను నిందితులకు, అక్రమార్కులకు వెల్లడించకూడదు మరియు పూర్తి గోప్యతను పాటించాలని సూచించారు.

**అక్రమ రిమాండ్లు:**

ఎలాంటి నిజనిర్ధారణ లేకుండా, రాజకీయ ఒత్తిళ్లతో దాఖలవుతున్న ఇటువంటి తప్పుడు కౌంటర్ ఫిర్యాదుల ఆధారంగా స్థానిక అధికారులు అమాయక దళితులను రిమాండ్‌కు మరియు జైలుకు పంపుతున్నారు. దీనివల్ల వారు తీవ్ర మానసిక క్షోభకు, సామాజిక అవమానానికి గురవుతున్నారు మరియు వారి ప్రాథమిక హక్కులు తీవ్రంగా ఉల్లంఘించబడుతున్నాయని తెలిపారు.

**ఎస్సీ ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టంలోని సెక్షన్ 4 అమలు పరచడం:**

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ విధులను నిర్లక్ష్యం చేస్తే విధించబడే శిక్షల గురించి స్పష్టం చేసే ఎస్సీ ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం లోని "సెక్షన్ 4" ను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నానని తెలిపారు.ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం, ఎస్సీ/ఎస్టీ పౌరులు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మరియు ఆ ఫిర్యాదులపై పక్షపాతం లేకుండా విచారణ జరపడం ప్రభుత్వ అధికారుల చట్టబద్ధమైన విధి. స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులు దళితుల పిటిషన్లను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టడం, అక్రమార్కులపై నిజమైన ఫిర్యాదులు వచ్చినప్పుడు కేసులు నమోదు చేయడానికి నిరాకరించడం, లేదా కుల వివక్షతో వ్యవహరిస్తూ ఫిర్యాదుదారుల వివరాలను నిందితులకు లీక్ చేసి వారి ప్రాణాలకు ముప్పు తలపెట్టడం ఈ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని తెలిపారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.